సాక్షి
ఏలూరు
శుక్రవారం । 29 । మార్చి । 2024
I




హుండీ ఆదాయం లెక్కింపు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 90 రోజులకు రూ.7,76,100 వచ్చింది.



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు మొగల్తూరు మండలం కుమ్మరుపు రుగుపాలెంకు చెందిన అందే వెంకటకృష్ణ రూ.1,00,116ను విరాళంగా అందించారు.



న్యూస్‌రీల్

మూల్యాంకన కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



డీఈఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో పదో పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనానికి ఏర్పాటు చేసిన కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని పీఆర్‌టీయూ నాయకులు డీఈఓ ఎస్. అబ్రహంను కోరారు. గురువారం డీఈఓ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. మూల్యాంకన కేంద్రాల్లో గాలి, వెలుతురు, సౌకర్యవంతమైన బెంచీలు, మంచినీరు, మరుగుదొడ్లు, మెడికల్ ఎమర్జన్సీ వంటివి ఏర్పాట్లు చేయాలని కోరారు. వివిధ ఇబ్బందులతో దరఖాస్తు చేసుకున్న వారందరికీ మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. జిల్లావ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన డీఈఓకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కేవీపీ సుబ్బారావు, పెదపాడు మండల అధ్యక్షుడు ఎండీ మురసలీన్ ఉన్నారు.

టెన్త్ పరీక్షల నిర్వహణ భేష్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో 2023–24 పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంపై వైఎస్‌ఆర్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటనలో హర్షం తెలిపారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకులు ఆర్.నరసింహారావు సారథ్యంలో డీఈఓ ఎస్. అబ్రహం, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్లు, డీఈఓ, సమగ్రశిక్ష కార్యాలయాల సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేయడం అభినందనీయని పేర్కొన్నారు. పరీక్షలకు సౌకర్యాలు బాగున్నాయని, అలాగే మూల్యాంకనాన్ని కూడా విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్, ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పగడాల సాంబశివరావు, వడ్లమూడి రామ్మోహనరావు ఉన్నారు.

కల్యాణ మండపాల రుసుముల పెంపునకు నిర్ణయం



శ్రీవారి ఆలయ రాజగోపురాల సముదాయం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి కొండపై, కొండ దిగువన భక్తులు వివాహాది శుభకార్యాలు జరుపుకునే దేవస్థానం కల్యాణ మండపాల రుసుములను పెంచేందుకు ధర్మకర్తల మండలి తీర్మానించిందని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు గురువారం ప్రకటనలో తెలిపారు. మండపాల నిర్వహణ, శానిటేషన్, విద్యుత్ వంటి ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పెరిగిన ధరలకు అదనంగా జీఎస్టీ, మెయింటెనెన్స్ రుసుములను చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కల్యాణ మండపాల రుసుముల పెంపుపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే భక్తులు 15 రోజుల్లోపు 08829–271469, 271436 ఫోన్ నంబర్ల ద్వారా తెలియజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పరీక్షలకు 3,962 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో పదో తరగతి కాంపోజిట్ సంస్కృతం, ఓఎస్‌ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–1 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 4,102 మంది రెగ్యులర్ విద్యార్థులకు 3,948 మంది, ఫెయిలైన విద్యార్థులు 39 మందికి 13 మంది హాజరయ్యారు. డీఈఓ రెండు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఒక కేంద్రంలో తనిఖీలు చేశారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

కాపులకు బీజేపీ అన్యాయం

ఏలూరు (టూటౌన్): తెలుగు రాష్ట్రాల్లోని కాపులకు బీజేపీ తీరని అన్యాయం చేసిందని కాపు సంక్షేమ సేన రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీరాములు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 6 పార్లమెంట్, 10 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుండగా కాపులకు ప్రాతినిధ్యం లేకపోవటంపై ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం రెండు ఎంపీ, మూడు ఎమ్మెల్యే స్థానాలను కాపులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బండి సంజయ్‌ని రాష్ట్ర అధ్యక్షుడిగా తప్పించి తప్పు చేశారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కాపుల ఓట్లు బీజేపీకి అక్కర లేదా అని ప్రశ్నించారు. కాపులకు న్యాయం చేసే దిశగా బీజేపీ అధిష్టానం ఆలోచన చేయాలని కోరారు.

టీడీపీ నేత దాష్టీకం

- ఆలయ కార్యదర్శిపై అమానుష దాడి
- వేంకటేశ్వరస్వామి పేరుతో భక్తుల సొమ్ము దోపిడీ
- ఆలయ నిధుల కైంకర్యంపై ఆరా తీయటంతో టార్గెట్
- కల్యాణ మండపం నిర్మాణంలోనూ అవకతవకలు?
- టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు రక్షణ ఉండదు : బాధితురాలు అచ్యుతకుమారి ఆవేదన



ఏలూరు జీజీహెచ్‌లో బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే ఆళ్ల నాని (ఫైల్), కమిలిపోయిన బాధితురాలి కంటి భాగం (ఇన్‌సెట్‌లో)



గుడిలో దాడికి ఉపయోగించిన మైక్ స్టాండ్

సాక్షి ప్రతినిధి, ఏలూరు /ఏలూరు టౌన్: ఏలూరులో శ్రీ లక్ష్మీ శ్రీనివాస పద్మావతి అమ్మవార్ల (శ్రీ వేంకటేశ్వర స్వామి) ఆలయ కమిటీ కార్యదర్శి చవాన్ అచ్యుతకుమారిపై టీడీపీ నాయకుడు అమానుష దాడికి తెగబడ్డాడు. దశాబ్ద కాలానికి పైగా స్వామివారి పేరుతో భక్తుల సొమ్మును దిగమింగుతున్న టీడీపీ నేత అవినీతిని ప్రశ్నించటంతో టార్గెట్ చేసి మరీ అత్యంత దారుణంగా హత్య చేసేందుకు కుట్రలు చేసి దాడికి పాల్పడ్డారంటూ బాధితురాలు ఆరోపిస్తున్నారు. మూడు రోజుల పాటు ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స అనంతరం బాధితురాలు కాస్త కోలుకోగా, ఆమెపై దాడికి సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేశారు.

టీడీపీ నేత రెడ్డి నాగరాజు కీచకపర్వం

వేంకటేశ్వరస్వామి ఆలయం పేరుతో దోపిడీకి పాల్పడుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతానికి చెందిన భక్తులు ఇటీవల కొత్త కమిటీని ఎన్నుకున్నారు. నెల రోజుల క్రితం ఈ కమిటీలో నూతన కార్యదర్శిగా అచ్యుతకుమారిని ఎన్నుకున్నారు. అచ్యుతకుమారి స్వామివారి ఆలయం ఆదాయం, అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం, పాత కమిటీ నిధుల సేకరణ, ఖర్చులపై ఆరా తీస్తూ ఉండడంతో పాత కమిటీ కార్యదర్శి, టీడీపీ నాయకుడు రెడ్డి నాగరాజు ఆమెపై కక్ష పెంచుకున్నాడు. కల్యాణ మండపం నిర్మాణం, స్థలం రిజిస్ట్రేషన్, విరాళాల వివరాలపై నూతన కార్యదర్శి అచ్యుతకుమారి ప్రశ్నిస్తూ... వివరాలు కావాలంటూ ఒత్తిడి తేవటం పాత కమిటీలోని నాయకులకు ఆగ్రహం తెప్పించింది. ఈనెల 25న శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో ఆలయంలో కూర్చుని ఉన్న అచ్యుతకుమారిపై టీడీపీ నాయకుడు రెడ్డి నాగరాజు మైకు స్టాండ్ రాడ్డుతో దాడి చేశాడు. ఆమె గుండెలపై పిడిగుద్దులు గుద్దటంతో పాటు కంటిపైనా ఇష్టారాజ్యంగా కొట్టాడు. బాధితురాలిని బుధవారం ఏలూరు జీజీహెచ్‌లో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని పరామర్శించి ధైర్యం చెప్పారు. మీ కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని, న్యాయం జరిగే వరకు తోడుంటామని భరోసా ఇచ్చారు.

రెడ్డి నాగరాజు కనుసన్నల్లోనే..

శ్రీ లక్ష్మీ శ్రీనివాస పద్మావతి అమ్మవార్ల ఆలయ కమిటీ పేరుతో రెడ్డి నాగరాజు అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. 17 ఏళ్లుగా పక్కా పథకం ప్రకారమే ఆలయ భక్తుల విరాళాలు, సొమ్ములను కైంకర్యం చేస్తున్నారని అంటున్నారు. ఆలయానికి సంబంధించి కనీసం బిల్లు పుస్తకం కూడా లేకుండా, కమిటీని రెన్యూవల్ చేయకుండా నాగరాజు తన కనుసన్నల్లోనే నడిపిస్తున్నాడని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయ కల్యాణ మండపానికి సైతం అప్పటి కమిటీ ప్రెసిడెంట్ రామారావు పేరుతో రిజిస్ట్రేషన్ చేయటంలోనూ నాగరాజు కీలకపాత్ర పోషించాడని చెబుతున్నారు. కల్యాణ మండపం నిర్మిస్తున్న సమయంలోనే నాగరాజు సొంతంగా అదే ప్రాంతంలో పెద్ద భవనాన్ని నిర్మించటం విమర్శలకు మరింత బలాన్నిస్తోంది.

టీడీపీ గెలిస్తే మహిళలకు రక్షణ కరువు

అచ్యుతకుమారి, ఆలయ కార్యదర్శి, బాధితురాలు



ఏలూరు టీడీపీ నాయకుడు రెడ్డి నాగరాజు తనపై అత్యంత దారుణంగా దాడి చేసి చంపేందుకు కుట్ర చేశాడని బాధితురాలు, ఆలయ కార్యదర్శి అచ్యుతకుమారి తెలిపారు. పాత కమిటీ నాయకుడు ఉమామహేశ్వరరావు సైతం అతనికి సహకరిస్తున్నారని ఆరోపించారు. కల్యాణమండపం భవనానికి కనీసం ప్లాన్ అప్రూవల్ లేదని, పంచాయతీ అనుమతి కూడా తీసుకోలేదని, దాతల నుంచి విరాళాలుగా నగదు, బంగారం సేకరించారని, వాటిపై నిలదీశాననే కారణంగా తన అడ్డు తొలగించుకునేందుకు ప్లాన్ చేశారన్నారు. ఐదేళ్లుగా ఏలూరు నగరంలో ప్రజలు ప్రశాంతంగా జీవించారని, ఎన్నికలు సమీపించటంతో తామే గెలుస్తామని, మీ అంతు చూస్తామంటూ టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే ఇక సాధారణ ప్రజలు, మహిళలకు రక్షణ ఉండదని, రౌడీరాజ్యం వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తనకు, తన కుమారుడు, కుటుంబ సభ్యులకు టీడీపీ నేత రెడ్డి నాగరాజుతో ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఆమె కోరారు. తనపై దాడి జరిగిన రోజునే తన కుమారుడిపై సైతం దాడి చేసి హతమార్చేందుకు రౌడీలను పంపారని అచ్యుతకుమారి వాపోయారు.

కల్యాణ మండపం పేరుతో అవినీతి?

ఆలయం పక్కన 330 గజాల స్థలం ఉంది. ఆలయ నీడ పడుతుందనే కారణంగా ఈ స్థలాన్ని ఎవరూ కొనుగోలు చేయలేదు. దాత ఈ స్థలాన్ని ఆలయం కోసం ఇచ్చినా ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయలేదు. 13 ఏళ్ల క్రితం ఆలయ కమిటీ కల్యాణ మండపం నిర్మాణానికి నిర్ణయించగా, స్థలం దాత బెల్లంకొండ వెంకటేశ్వరరావు మృతిచెందటంతో ఆయన కుమారునితో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే ఆలయం పేరున కాకుండా అప్పటి కమిటీ ప్రెసిడెంట్ బడుగు రామారావు పేరుతో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం నాలుగేళ్ల క్రితం కల్యాణ మండపం నిర్మాణానికి భారీ ఎత్తున నిధులు వసూలు చేశారని, అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక ఈ ఆలయ కమిటీ ఎనిమిదేళ్లుగా రెన్యూవల్ చేయకుండా ఉందని, భక్తుల దానాలకు కనీసం రసీదు లేకుండానే కమిటీ పేరుతో దోపిడీ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కల్యాణ మండపం నిర్మాణానికి సంబంధించి కోట్లాది రూపాయలు వసూలయ్యాయని, వాటికి లెక్కాపత్రాలు లేకుండా కమిటీ పేరుతో దోచేశారని పలువురు అంటున్నారు.



ఏలూరు కండ్రికగూడెంలో లక్ష్మీ శ్రీనివాస పద్మావతీ అమ్మవార్ల ఆలయం

సీఎం జగన్‌తోనే సంక్షేమ రాజ్యం

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గణపవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం సంక్షేమ రాజ్యంగా అవతరించిందని, ఐదేళ్ల పాలనలో పేదలకు నూరుశాతం న్యాయం జరిగిందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని చిలకంపాడులో మన ఊరు, మన వాసన్న కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం చేశారు. గతంలో పేదల గురించి ఏనాడూ ఆలోచించని చంద్రబాబు ఇప్పుడు పేదలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలంటూ మాయచేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేసిన ఘనత సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లామన్నారు. జగన్‌ను మరోమారు సీఎంగా చేసుకోవాలన్న కోరిక ప్రజల్లో ఉందని, దీంతో చంద్రబాబు పొత్తుల పేరుతో కుటిల పన్నాగాలు పన్నుతున్నారన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు నౌడు వెంకటరమణ, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ దండు రాము, మండల గృహసారథుల కన్వీనర్ మద్దాల రామకృష్ణ నాయకులు ఉన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

వలస పక్షిని పెనమలూరు తరిమికొడదాం

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

ముసునూరు: అవకాశవాది, వలసపక్షిని పెనమలూరుకు తరిమికొట్టాలని నూజివీడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. పార్టీ మండల, యూత్ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, గూట్రు రంగారావు ఆధ్వర్యంలో సూరేపల్లి, లోపూడి, బాసవరప్పాడు గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గానికి పనికిరాని వ్యక్తి నూజివీడు వచ్చి, ఉనికి కోసం అవాకులు, చవాకులు పేలడం విడ్డూరంగా ఉందన్నారు. పెనమలూరు అబద్ధాలు నమ్మకండి.. వలసపక్షి, పచ్చి అవకాశవాది అని వచ్చిన చోటుకే తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. చింతలపూడికి, తోటపల్లికి తేడా తెలియని వ్యక్తి మాటలు నమ్మవద్దన్నారు. నూజివీడు జమిందారీ వంశ చరిత్రను ఒక్కసారి గుర్తు చేసుకుని ఓటు అనే వజ్రాయుధాన్ని సంధించాలన్నారు. సీఎం జగన్ నాయకత్వంలో నూజివీడు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాలైన లోపూడి, సూరేపల్లిలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్లు, అంతర్గత రోడ్లు, ధాన్యం గోదాములు నిర్మించామన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోందన్నారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావుకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ బర్మా సీతారామయ్య, ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజా నాయన, గంగాధర్, సర్పంచ్ పేరం కృష్ణ, ఉప సర్పంచ్ బాబూరావు, నాయకులు ఉన్నారు.




ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

రామోజీరావు రాతలకు బెదరను

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు

కైకలూరు: పచ్చపత్రికను అడ్డుపెట్టుకుని చెత్త రాతలు రాస్తున్న డ్రామోజీరావు (రామోజీరావు)కు బయపడే ప్రసక్తే లేదని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. పచ్చపత్రికలో తనపై, తన కుమారుడిపై వచ్చిన అసత్య కథనంపై కలిదిండిలో గురువారం ఆయన స్పందించారు. స్థానిక నాయకుడు కామినేని శ్రీనివాస్ పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్నారని 2019 ఎన్నికల్లో ఎందుకు నియోజకవర్గం నుంచి పారిపోయారో చెప్పాలని డిమాండ్ చేశారు. తన కొడుకులు చంద్రబాబు కుమారుడు మాదిరి పప్పు కాదని, నిప్పులని అన్నారు. కామినేని కుమారులు ఆయన మంత్రిగా ఉన్నప్పుడు దోచుకున్న సొమ్మును అమెరికా, హైదరాబాద్‌లో పెట్టి సెటిల్‌మెంట్లు చేస్తున్నారని ఆరోపించారు. రోజుకో, గంటకో ముసుగు మార్చే కామినేని చేస్తున్న ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు. ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని, ఆ దమ్ము కామినేనికి ఉందా అని ప్రశ్నించారు. కామినేని తనపై చేస్తున్న ఆరోపణలను ప్రజాక్షేత్రంలోనే ఎదుర్కొంటానని డీఎన్నార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కలిదిండిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

సీ-విజిల్‌పై అవగాహన

ఏలూరు(మెట్రో): ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన సీ–విజిల్ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. గురువారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, సీ–విజిల్, ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీ-విజిల్‌పై అవగాహన కల్పించే బ్యానర్లు ఏర్పాటుచేయాలన్నారు. రాజకీయపక్షాల ప్రతినిధులు కూడా సంబంధిత వివరాలను అందజేయాలన్నారు. సీ–విజిల్ ఫిర్యాదుల పరిష్కారంపై చొరవ చూపిన ఉంగుటూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలిని కలెక్టర్ అభినందించారు. సువిధ, ఎన్‌కోర్ పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులను మంజూరు చేయాలన్నారు.

విశ్వసనీయతకు మారుపేరు జగన్

విజయరాజు, సునీల్‌కుమార్ యాదవ్

జంగారెడ్డిగూడెం: విశ్వసనీయతకు మారుపేరు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి కంభం విజయరాజు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ ఆశయాలు సాధించే దిశగా తాము పనిచేస్తామన్నారు. ఎన్నికల్లో తమను గెలిపించి తద్వారా జగన్‌ను మరో మారు సీఎం చేయాలని కోరారు. ఐదేళ్లలో సీఎం జగన్ అద్భుతంగా పాలన చేశారని, మీ కుటుంబానికి మేలు జరిగితేనే నాకు ఓటు వేయండి అని ధైర్యంగా చెబుతున్నారని, అదే మాటను చెబుతూ తమనూ ఓట్లు అభ్యర్థించాలని దిశానిర్దేశం చేశారన్నారు. సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేశారన్నారు. ఆయన పాలనలో రాష్ట్రం అభివృద్ధి బాటలో సాగింద న్నారు.



జంగారెడ్డిగూడెంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

గిరిజన భాషలో ఎన్నికల ప్రచారం



యాలికలగూడెంలో డోలు వాయిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: కుక్కునూరు మండలం అమరవరం పంచాయతీ యాలికలగూడెం గ్రామానికి ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, అభ్యర్థి రాజ్యలక్ష్మి దంపతులకు అక్కడి గిరిజనులు సంప్రదాయ డోలు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు కూడా మెడలో డోలు వాయిద్యాలను వేసుకుని వారితో పాటు వాయిస్తూ నృత్యాలు చేశారు. ఏజెన్సీ గ్రామాల్లో పర్యటించిన రాజ్యలక్ష్మి గిరిజన భాషలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు చంద్రబాబు చేసిన ద్రోహాన్ని గిరిజన భాషలోనే వారికి వివరించారు. మళ్లీ చంద్రబాబు గెలిస్తే కష్టాలు తప్పవని ఓటుతో పొత్తుల కూటమిని ఓడించాలని ఆమె పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం

ఏలూరు(మెట్రో): జిల్లాలో గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం చట్టం అమలు జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. చట్టాన్ని అతిక్రమించిన స్కానింగ్ సెంటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో మూడు నెలల్లో పలు ఆస్పత్రుల్లో 136 అబార్షన్లు జరిగాయని, వీటిపై ఆడిటింగ్ చేయాలన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించేలా పోటీలు నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఏఎస్పీ స్వరూపరాణి, డీఎంహెచ్‌ఓ డా.శర్మిష్ట, జిల్లా ఆస్పత్రి సేవల సమన్వయాధికారి డా.పాల్ సతీష్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ఆర్కిడ్ సొసైటీ ఉపాధ్యక్షుడిగా జానకిరామ్

తాడేపల్లిగూడెం: ది ఆర్కిడ్ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా రెండోసారి తాడేపల్లిగూడెం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి టి.జానకిరామ్ ఎంపికయ్యారు. మహారాష్ట్ర పూనెలో ఇటీవల ఆర్కిడ్ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు, వర్క్‌షాపులో ఆయన్ను ఎంపికచేశారు. జానకిరామ్ రెండేళ్లపాటు పదవిలో ఉంటారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఆర్కిడ్ సాగును ప్రోత్సహిస్తూ గిరిజన రైతులకు ఉద్యాన వర్సిటీ చేయూతనిస్తుందన్నారు. వివిధ పరిశోధనా పత్రాలను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు ఆయన్ను అభినందించారు.

కోరుకొల్లులో నాటు తుపాకీ స్వాధీనం



కలిదిండి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. కోరుకొల్లు గ్రామంలో లైసెన్సు లేకుండా పక్షులను చంపడానికి ఉపయోగించే నాటు తుపాకీని గురువారం స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు జిల్లా గూడూరు గ్రామానికి చెందిన నక్కల ఏడుకొండలు (37) నాటు తుపాకీతో సంచరిస్తుండగా కలిదిండి ఎస్‌ఐ ప్రియకుమార్ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మోడరన్ పెంటాథ్లాన్ రాష్ట్ర పోటీలకు ఎంపిక



మోడరన్ పెంటాథ్లాన్ జిల్లా జట్టుకు ఎంపికైన గురుకుల విద్యార్థులు

పెదవేగి: పెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో గురువారం నిర్వహించిన మోడరన్ పెంటాథ్లాన్ క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయానికి చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని అండర్–19 విభాగం కార్యదర్శి కె.జయరాజు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30, 31వ తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను విద్యాలయం ప్రిన్సిపాల్ పి.ఆదినారాయణ, పీఈటీ గురుమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సమావేశం

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఏలూరులో నిర్వహించనున్నామని అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీను గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఏప్రిల్ నెలాఖరులో ఏలూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల నిర్వహణ, అసోసియేషన్ కార్యాచరణపై సభ్యులు చర్చించనున్నారని వెల్లడించారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు, క్లబ్స్ నిర్వాహకులు, సీనియర్ క్రీడాకారులు, పీఈటీలు, పీడీలు పాల్గొంటారని తెలిపారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా

- ప్రతి వాహనం క్షుణ్ణంగా పరిశీలన
- ఎస్ఈబీ ఏఎస్పీ సూర్యచంద్రరావు వెల్లడి
- జీలుగుమిల్లి చెక్‌పోస్టు తనిఖీ

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం నగదు, మద్యం అక్రమ రవాణా నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావు అన్నారు. జీలుగుమిల్లి బోర్డర్ చెక్‌పోస్టును గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రా సరిహద్దులో జీలుగుమిల్లిలో చెక్‌పోస్ట్, అలాగే 25 మీటర్ల దూరంలో తెలంగాణ ప్రాంతంలో మరో చెక్‌పోస్ట్ ఉందన్నారు. రెండు వైపులా నుంచి కూడా వాహనాలను తనిఖీ చేస్తారన్నారు. చెక్‌పోస్టుల వద్ద ఒక ఎస్సై ఆధ్వర్యంలో 24 గంటలూ తనిఖీలు జరుగుతాయన్నారు. ఎస్సైతో పాటు ఇద్దరు స్పెషల్ పార్టీ కానిస్టేబుళ్లు, ఇద్దరు ఎక్సైజ్ కానిస్టేబుళ్లు ఉంటారన్నారు. ఆర్‌టీఏ, కమర్షియల్, రెవెన్యూ శాఖల ద్వారా కూడా చెక్‌పోస్టులలో ఉదయం, సాయంత్రం తనిఖీలు చేస్తారన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి సొమ్మును తరలిస్తే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. వ్యాపారులు బంగారం, వెండి వస్తువులు రవాణా చేస్తూ పట్టుబడినా ఆ వస్తువులను కూడా సీజ్ చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా లిక్కర్, గంజాయి పట్టుబడితే సీజ్ చేస్తామన్నారు. ప్రతి వాహనం క్షుణ్ణంగా తనిఖీలు చేస్తామన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడానికి బట్టలు, వాచీలు, కుక్కర్లు వంటి వస్తువులు తరలిస్తున్న వాహనాలు తనిఖీల్లో దొరికితే వాటిని కూడా సీజ్ చెయ్యడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూస్తున్నామని అన్నారు. సరిహద్దుల్లోని చెక్‌పోస్టులో నిఘా పటిష్టం చేశామని చెప్పారు. అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమమద్యం, సారాయి ఏపీలోకి రాకుండా ప్రధాన చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీబీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జీలుగుమిల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావు

బాస్కెట్‌బాల్ జాతీయ టోర్నీ ప్రారంభం

నూజివీడు: నూజివీడు ప్రాంతంలో బాస్కెట్‌బాల్‌కు విశేష ఆదరణ ఉందని డీఏఆర్ కళాశాల అధ్యక్షులు ఎంఎంఆర్‌వీ అప్పారావు అన్నారు. దివంగత బొబ్బిలి కొండలరావు మెమోరియల్ ఇన్విటేషన్ జాతీయ పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలను డీఏఆర్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించడం నూజివీడుకే గర్వకారణమన్నారు. నేటి యువత చదువుతో పాటు క్రీడలపైన కూడా ఆసక్తిని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. అనంతరం పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ఇండియన్ ఆర్మీ, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ నేవీ, కేఎస్ఈబీ కేరళ, జైన్ యూనివర్శిటీ, ఆంధ్రప్రదేశ్ జట్లకు చెందిన ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు. నాలుగు రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ సీహెచ్ చక్రవర్తి, కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు జీఎస్‌సీ బోస్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, బొబ్బిలి వెంకటప్పయ్య, దాసరి సూర్యనారాయణ, టీవీ కృష్ణారావు, రాజగోపాల్, జీవీ రామారావు, ప్రముఖ పారిశ్రామికవేత్త మూల్పూరి లక్ష్మణస్వామి పాల్గొన్నారు.



నూజివీడులో బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభం సభలో మాట్లాడుతున్న అప్పారావు

అంతర్ జిల్లా బైక్‌ల దొంగ అరెస్టు

రూ.20 లక్షల విలువైన 37 బైక్‌ల స్వాధీనం

తోట్లవల్లూరు: అంతర్ జిల్లా మోటారు సైకిళ్ల దొంగను తోట్లవల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.20 లక్షల విలువైన బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ గురువారం సాయంత్రం తోట్లవల్లూరులో విలేకరులకు వెల్లడించారు. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం వల్లభాపురంలోని రామనగర్‌కు చెందిన ఒడుగు సుబ్బారావు కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురులో నాలుగేళ్లుగా తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యసనాలకు బానిసైన సుబ్బారావు బైక్ దొంగతనాలకు అలవాటుపడ్డాడు. కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, గుంటూరు, ఏలూరు జిల్లాల్లోని 18 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 37 బైక్‌లను అపహరించాడు. తోట్లవల్లూరు వద్ద కృష్ణా కరకట్టపై పమిడిముక్కల సీఐ ఎం.కిషోర్‌బాబు, ఎస్సై పి.విశ్వనాథ్ గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా బైక్‌పై వెళుతున్న ఒడుగు సుబ్బారావును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా బైక్‌ల చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడి నుంచి రూ.20 లక్షల విలువైన 37 మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఉయ్యూరు పదో అదనపు మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ కిషోర్‌బాబు, ఎస్సై విశ్వనాథ్, హెడ్ కానిస్టేబుళ్లు నాగవెంకన్న, రవికుమార్, కానిస్టేబుళ్లు రమణ, రామకృష్ణను అభినందించి నగదు రివార్డులను అందజేశారు.

వ్యక్తి అరెస్టు.. 500 లీటర్ల డీజిల్ స్వాధీనం

భీమడోలు: సూరప్పగూడెం వద్ద జాతీయ రహదారిపై ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 500 లీటర్ల డీజిల్‌ను సివిల్ సప్‌లైయిస్ అధికారులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. భీమడోలు సివిల్ సప్‌లైయిస్ డీటీ ఎ.మాధవరావు ఆధ్వర్యంలో బృందం భీమడోలు, సూరప్పగూడెం రహదారులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో గుట్టుగా ఓ పాకలో టిన్నుల్లో పోసి ఉన్న డీజిల్ విక్రయించేందుకు సిద్ధంగా ఉండగా గుర్తించి పట్టుకున్నారు. డీజిల్ కలిగి ఉన్న తూర్పుగోదావరి జిల్లా కత్తిపూడికి చెందిన తాతాబ్బాయి రాజు అనే వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేశారు. ఇతను రాత్రి వేళల్లో లారీ డ్రైవర్లను నుంచి తక్కువ ధరకు డీజిల్ కొనుగోలు చేసి ఇతర వాహనాలకు విక్రయిస్తూ ఉంటాడని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో లారీల నుంచి సేకరించిన రూ.50 వేల విలువ చేసే 500 లీటర్ల డీజిల్‌ను తన వద్ద గల వాటర్ టిన్నుల్లో పోసి అమ్మేందుకు సిద్ధంగా ఉంచగా అధికారులు పట్టుకుని డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో వీఆర్వోలు వెజ్జు వినయ్ కుమార్, మార్కేండేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



సూరప్పగూడెం వద్ద డీజిల్‌ను పట్టుకున్న అధికారులు

ప్రముఖుల వాహనాల తనిఖీలు

కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం కామవరపుకోట చెక్ పోస్టు వద్ద ప్రముఖుల వాహనాలను గురువారం తనిఖీలు చేసినట్లు మండల ఎన్నికల అధికారి మొహిద్దీన్ చెప్పారు. ఏలూరు జంగారెడ్డిగూడెం మార్గంలో ఎన్నికల చెక్‌పోస్టు మీదుగా వెళుతున్న తెనాలి ఎమ్మెల్యే కన్నావత్తుల శివకుమార్, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, మాజీ జెడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు వాహనాలలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే వాహనానికి, అలాగే చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచార వాహనాలకు జెండాలు ఉండటంతో అనుమతి ధ్రువపత్రాలను పోలీస్ కానిస్టేబుళ్లు రామకృష్ణ, అశోక్, సీఐఎస్ఎఫ్ జవాన్లుతో కలిసి పరిశీలన చేసి పంపించారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు కూడా పాటించాలని ఈ సందర్భంగా మొహిద్దీన్ తెలియజేశారు.



కొత్తూరులో చెక్‌పోస్ట్ వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారులు, పోలీసులు

దంత వైద్య విద్యార్థిని మౌనీషకు సత్కారం

పెదవేగి : జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరియోడెంటాలజీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కాన్ఫరెన్స్‌లో తమ కళాశాల విద్యార్థిని సత్తా చాటిందని దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్ చెప్పారు. పెదవేగిలో గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ బుధవారం జాతీయ స్థాయిలో నిర్వహించిన పిరియోడొంటోలజీ (చిగుళ్ళ వ్యాధిపై) శాస్త్రీయ పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్‌లో తమ కళాశాలకు చెందిన పీజీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని కొండెపాటి మౌనీష విజేతగా నిలిచిందన్నారు. ఈ ప్రదర్శనలో దేశంలోని అన్ని దంత వైద్య కళాశాలల్లోని పెరియోడొంటోలజి పీజీ విద్యార్థులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫాదర్ మోజెస్ మౌనీషకు పుష్పగుచ్ఛం, సర్టిఫికెట్‌తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి అరుణ్, పెరియోడొంటోలజి హెచ్ఓడి అరవింద్‌కుమార్, డాక్టర్ పి హరీష్ ప్రభుదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు టౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దెందులూరు మండలం సోమవరప్పాడు పంచాయతీ కొత్తపల్లికి చెందిన పరసా కోటేశ్వరరావు (73) కంటి పరీక్షల నిమిత్తం గురువారం ఏలూరు వచ్చాడు. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో రోడ్డు దాటుతుండగా తణుకు నుంచి వస్తున్న బస్సు వృద్ధుడిని ఢీకొంది. ఈ ప్రమాదంతో తీవ్ర గాయాలపాలైన కోటేశ్వరరావును స్థానికులు 108 వాహనంలో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగా కోటేశ్వరరావు మృతి చెందాడు. ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

భీమడోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి బుధవారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కురెళ్లగూడెంలో ఈనెల 26న తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వయస్సు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. వివరాలు తెలిసినవారు 94407 96652 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని ఎస్సై వై.సుధాకర్ గురువారం రాత్రి కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.